# వ్యాస కౌముది



## చాటువులు

- దూర్వాసుల వేంకట సుబ్బారావు



1770 - 1820 ల మధ్య తెలుగుభాషకు అపార సేవ చేసిన అగ్రగణ్యుడు సి.పి.బ్రౌన్ దొర. అనేక పండితులను ఆహ్వానించి, వారితో చర్చించి ఇంగ్లీషు - తెలుగు నిఘంటువు వ్రాసిన మేధావి. తెనుగు భాగవతం బాగా చదివి తన స్వంతం చేసుకున్నాడు. ఒక బీద పండితుడు చాల ఇబ్బంది పడుతూ, అర్థిస్తూ పోతనగారి భాగవతం నుంచి ఒక పద్యాన్ని కొద్దిగా ఈ విధంగా మార్చి చదివితే:

*లావొక్కింతయు లేదు ధైర్యము విలోలంబయ్యె బ్రాణంబులా*
*ఠావులప్పెను మూర్ఛ వచ్చె దనువున్ డస్సెన్ శ్రమంబయ్యెడిన్*
*నీవే తప్ప నితః పరంబెఱుగ మన్నింపదగున్. దీనునిన్*
*రావే ఈశ్వర! కావవే వరద! సంరక్షింపు బ్రౌను దొరా!*

ఈ భట్రాజు పొగడ్తలు నచ్చని బ్రౌన్ అదే భాగవతం నుంచి ఇలా జవాబు వ్రాసారు:

*ఏనుమృతుండ నౌదునని ఇంత భయంబు మనంబులోపలన్*
*మానుము సంభవంబు గల మానవ కోట్లకు జావునిక్కమౌ*
*గానహరిదలంపు మిక గల్గదు జన్మము ధాత్రిపై*
*మానవ నాథ! పొందెదవు మాధవలోక నివాస సౌఖ్యముల్*

ఈ చాటువుల పొగడ్తలు ఒక్క తెలుగు ప్రభువులకే కాక, సుల్తానులకు కూడ అన్వయిస్తుంది. ఇబ్రహీం అనే సుల్తాను (1550) చాలా ప్రజోపకార్యాలు చేసాడు. తెలుగు బాగా నేర్చుకుని తెలుగు ముషైరాలు జరిపిస్తూ అందరి మన్నలను పొందాడు. ఇంకేం మన కవీంద్రులందరూ ఇతన్ని ఆకాశానికి ఎత్తేశారు. ఇబ్రహీంని ఇభరామ్ అని పిలుస్తూ, మనకున్న ఆరుగురు చక్రవర్తులనగా హరిశ్చంద్రుడు, నలుడు, పురుకుత్సుడు, పురూరువుడు, సగరుడు, కార్తవీర్యార్జనుడు - ఈ ఇభరామ్‌కి సాటికాదని ఏడవ చక్రవర్తిగా, పదిహేడవ మహారాజుగా చెప్పారు. అంతటితో ఆగక మన పురాణాల్లోని ఏ రాముడు ఈ ఇభరామునికి సాటికాదని ఈ విధంగా చెప్పారు ఒక చాటువులో

*రాముడు దుక్కిముచ్చు, రఘురాముడు క్రోతుల రాజు, రేణుకా*
*రాముడు పోటు బంటు, పటురాగసమంచితుడైన గోపికా*
*రాముడు వెఱిగొల్ల, ఒక రాష్ట్రములందు సమాను లేరయా*

*రాముల నెంచి చూడ నిభరామ మహీధవభవ్య వైభవా!*

చాటువులకు కవి చౌడప్ప పేరు చెప్పితీరాలి. ఇతడు 1600 ప్రాంతంలో తంజావూరు ధరణీ నాయకుల కొలవులో నీతి పద్యాలను చెపుతూనే, నవ్వుపుట్టించటానికి ఎన్నో చాటవులు చెప్పాడు. తెనుగు సాహిత్యంలో అసలు సిసలు బూతుకవి ఇతడే ఈ కుందవరపు చౌడప్ప కందాల గురించి ఇలా అన్నాడు.

*కందం తిక్కనగారిది*

*కుందవరపు వారి ముద్దు క్కురని దంతే*

*అందరి తరమా కందపు*

*చిందుల కిటుకుల్ గ్రహింప సిరిసిరి మువ్వా!*

తన శతకంలో చౌడప్ప అడిగిన ప్రశ్న సహజమే - అది ఏమనగా

*బూతని నగుదురు తమ తమ*

*తాతలు ముత్తాత మొదలు తరతరములవా*

*రే తీరున జనించిరో*

*ఖ్యాతిగమరి? కుందవరపు కవి చౌడప్పా!*

అంతటితో గాక తన బూతు కవిత్వాన్ని ఇలా సమర్థించుకున్న విధం చూడండి:

*నీతులకేమి యొకించుక*

*బూతాడక దొరకు నవ్వు పుట్టదు ధరలో*

*నీతులు బూతులు లోక*

*ఖ్యాతులురా కుంద వరపు కవి చౌడప్పా!*

*పది నీతులు పదిబూతులు*

*పది శృంగారములు గల్గు పద్యములు సభన్*

*జదివిన వాడే యధికుడు*

*గదరప్పా కుందవరపు కవి చౌడప్పా.*

శ్రీనాథుని క్రీడాభిరామంలోనూ, సెట్టి లక్ష్మీ నరసింహంగారి శృంగార పంచకము (1922) లోనూ చౌడప్పచాటువుల్లాంటివి చాలా ఉన్నాయి. చాటువులు సందర్భోచితాలు, ఆశువుగా హాస్యధోరణిలో చెప్పబడ్డవికాన వాటిని అలాగే చదవాలి. అయితే ఇన్ని పద్యాలు అవసరమా అంటే మహాయోగి, జ్ఞాని వేమనదే వేదవాక్యం, ఆఖరి మాట.

*నిక్కమైన మంచి నీల మొక్కటి చాలు*

*తళుకు బెళుకు రాళ్ళు తట్టెడేల?*

*చాటు పద్యమొకటి చాలదాయిలలోన*

*విశ్వదాభిరామ వినురవేమ!*

(అయిపోయింది)